

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి

- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

12


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

మంగళవారం | 5 ఆగస్టు 2025 | 12 పేజీలు


# అడిగేదెవరు.. ఆపేదెవరు..?

- బెల్లంపల్లి నియోజకవర్గంలో జోరుగా మట్టి, మొరం అక్రమ తవ్వకాలు
- ప్రభుత్వ అభివృద్ధి పనులు, అవసరాల పేరిట అనుమతులు
- పలు మండలాల పరిధిల్లోనూ నిత్యకృత్యమే..
- కరువైన అధికారుల చర్యలు
- ఏకంగా ప్రభుత్వ స్థలాలు, అటవీ భూముల్లోనే తవ్వకాలు
- టిప్పర్లు, ఇతర వాహనాల ద్వారా మొరం, మట్టి తరలింపు
- అందినకాడికి దండుకుంటున్న అక్రమార్కులు
- నామమాత్రంగా తనిఖీలు
- వ్యాపారులదే ఇష్టారాజ్యం
- పక్కదారి పడుతున్న ప్రకృతి సంపద

## యథేచ్ఛగా మొరం దందా



బెల్లంపల్లి పట్టణ శివారు, మండల పరిధిలోని ప్రభుత్వ భూముల నుంచి అనుమతి లేకుండా మొరాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేపట్టడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ అక్రమ దందా సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బెల్లంపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న మెయిన్ రోడ్డు పక్కన బూధాకలాన్ రాతి చెరువు సమీపంలో ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా తవ్వి తీసిన మొరాన్ని ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఆకెనపల్లి, పాతబెల్లంపల్లి శివారులోని పట్టణంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద అక్రమంగా తవ్వకాలు జరిపి మొరాన్ని తరలిస్తున్నారు. బూధాఖుర్దు, బట్వాన్‌పల్లి, పెరకపల్లి గ్రామాల శివారుల్లో సైతం అనుమతి లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. బెల్లంపల్లి మండలంలో పలు గ్రామపంచాయతీల పరిధిలో కూడా మొరం దందా సాగుతున్నట్లు తెలుస్తున్నది. ఈ తతంగమంతా పగలు, రాత్రి అని తేడా లేకుండా జరుగుతున్నదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు అందుబాటులో లేని శని, ఆదివారాలతో పాటు, ప్రభుత్వ సెలవు రోజుల్లో మరింత జోరుగా సాగుతున్నదని విమర్శలు వస్తున్నాయి. ట్రాక్టర్ మొరాన్ని మట్టిని రూ.800 నుంచి 1000 విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.



స్థానికుల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందినప్పుడు నామమాత్రపు తనిఖీ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- వివరాలు 11లో



12

### టైగర్‌జోన్‌లో భారీ వాహనాలకు

# త్వరలోనే అనుమతి

- అటవీ శాఖ వైల్డ్ లైఫ్ బోర్డ్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్..

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలకు త్వరలోనే అనుమతులు వస్తాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ రాష్ట్ర అటవీ శాఖ వైల్డ్ లైఫ్ బోర్డ్ సమావేశంలో పలు విషయాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రం విలేకరులతో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకకు సహకరించాలని, అటవీ హక్కు చట్టం ప్రకారం అడవిలో ఉండే ఆదివాసీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. అటవీ ప్రాంత అభివృద్ధిపై మంత్రులు సీతక్క, సురేఖతో చర్చించినట్లు ఆయన తెలిపారు.

### గురుకులంలో

# ఫుడ్ పాయిజన్

- ముగ్గురు విద్యార్థులకు అస్వస్థత
- భోజనం తిని కడుపు నొప్పితో అస్వస్థతకు గురైన విద్యార్థినులు
- అంబులెన్స్ కోసం పడిగాపులు
- ఆస్పత్రిలో చేర్పించి చికిత్స
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహంలో ఘటన
- ఇటీవల గురుకులాల్లో తరచు ఫుడ్‌పాయిజన్ ఘటనలు





12

# ఆదివాసీ బిడ్డకు అరుదైన అవకాశం

- రాష్ట్రపతి విందుకు కైలాష్‌కు ఆహ్వానం..
- గౌరాపూర్ ఉపాధ్యాయుడికి గుర్తింపు
- పంద్రాగస్టు ప్రత్యేక కార్యక్రమానికి పిలుపు
- గోండి భాషలో 'పండోక్న మహాభారత్ కథ'ను రాసిన తొడసం కైలాష్..
- 330 గోండు భాషల్లో పాటలు

ఇంద్రవెల్లి మండలం గౌరపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు తొడసం కైలాష్‌కు అరుదైన గౌరవం దక్కింది. కేవలం 4 నెలల్లోనే గోండి భాషలో మహా భారతం పుస్తకాన్ని రచించిన ఆయనకు పంద్రాగస్టు సందర్భంగా రాష్ట్రపతితో విందులో పాల్గొనేందుకు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం అందింది. ఈ లేఖను సోమవారం సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సందీప్, పోస్టల్ పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్పెక్టర్ మహేష్, పోస్ట్‌మెన్‌లు ప్రణయ్, సాయి, ఎంఓ మునీర్.. కైలాష్ స్వగ్రామం వాఘపూర్‌కు వెళ్లి అందజేశారు.



# ముధోల్‌లో పశువులు చోరీ

- జెర్సీ జాతికి చెందిన ఆవు అపహరణ
- ఎద్ల మాంసంను తీసుకెళ్లి కలేబరాలను చెట్లపొదల్లో వేసిన దుండగులు - 2లో

### పసికందుతో రాళ్ల దారిలో

# ఇంటికి చేరిన బాలింత

- అడవి బిడ్డల ప్రసవ వేదన.. అరణ్య రోధన
- వాగుపై వంతెన లేక ప్రమాదమని తెలిసినా..
- జిల్లా కేంద్రానికి 7కిలో మీటర్ల దూరంలోనే..






## ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను
# ప్రజలు వినియోగించుకోవాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, సిబ్బందిని నియమించి అవసరమైన మందులను అందుబాటులో ఉంచి అందిస్తున్న మెరుగైన వైద్య సేవలు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అంటువ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం, మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలను సందర్శించి వంటశాల, మూత్రశాలలు, తరగతి గదులు, హాజరు పట్టికలు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యాబోధన అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన తాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించుకోవాలని తెలిపారు. వర్షాకాలం అయినందున వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత ఎంతో అవసరమని, విద్యార్థులు ఆహారం, త్రాగునీరు తీసుకునే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రపరుచుకోవాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి



వివిధ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి పఠనా సామర్థ్యాలను తెలుసుకున్నారు. మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు పాఠ్యాంశాలు బోధించి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# రూ.2 లక్షల విలువైన పశువులు చోరీ





**ముథోల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

ముథోల్ మండలానికి చెందిన హంగిరిగా భోజన్న అనే రైతుకు చెందిన జెర్సీ జాతికి చెందిన ఆవుతో పాటు ఒక జత కంకలును ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు దొంగలించి నేరుగా తీసుకెళ్లగా సోమవారం హంగిరిగా భోజన్న యజమాని వెతకాగా, బాసర మండలం టాక్లి-కిరుగుల్ రహదారి మార్గమధ్యన పంట చేనులో పెద్ద జాతికి చెందిన జెర్సీ ఆవుతో పాటు జోడి కంకల మాంసాన్ని తీసుకొని కళేబరాన్ని వదిలేసి దుండగులు పారిపోయినట్లు స్పష్టంగా కనబడుతుంది. దీనితో నేరుగా యజమాని హంగిరిగా భోజన్న ముథోల్ ఎస్సై పెర్సిస్ కు ఫిర్యాదు చేయగా ఎస్సై నేరుగా సంఘటన స్థలానికి చేరుకొని ఆవు ఒక జత కంకల యొక్క కళేబరం పశు వైద్యులకు చూపించి నిర్ధారణ చేశారు అనంతరం పంచనామా చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాసర ముథోల్ ఎస్ఐలు శ్రీనివాస్ పెర్సిస్ మాట్లాడుతూ... ఇటీవలనే శనివారం బాసర మండలం బిదిరెల్లి గ్రామంలో కాడెద్దును గుర్తుతెలియని దుండగులు అపహరించి లాబ్ది శివారులో కాడెద్దు యొక్క మాంసాన్ని తీసుకొని పారిపోగా అది మరొక ముందే ముథోల్ పట్టణంలో మరో ఘటన జరగడం చాలా దురదృష్టకరమని ఎంతటి వారైనా సరే వారిని పట్టుకుని త్వరలోనే ఇలాంటి సంఘటనలుకు పాల్పడుతున్న వారిపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు. దీనితో అంగీర్గా భోజన్న కుటుంబ సభ్యులు పెద్ద జాతికి చెందిన గర్భవతి జెర్సీ ఆవుతో పాటు ఒక జత కంకలును ఇంత ఘోరంగా చేయడం హేయమంగ ఉందని కనీసం మానవ దృక్పథంతో గర్భవతి ఆవును కూడా చూడకుండా ఇలాంటి ఘోరాన్ని చేయడం చూసి యజమాని కంటతడి పెడుతూ తమ రోదనలు పలువురిని మిన్నంటాయి. వీటి విలువ 2.లక్షలకుపై చిలుకు ఉంటుందని తెలిపారు.



## గురుకులంలో ఫుడ్ పాయిజన్

### ముగ్గురు విద్యార్థులకు అస్వస్థత

**రెబ్బెన, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

రెబ్బెన మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహంలో భోజనం తిని ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు భోజనం చేసిన అనంతరం ఒక్కసారిగా కడుపు నొప్పితో బాధపడుతూ విలవిలలాడారు. దీంతో విద్యార్థులను వెంటనే రెబ్బెన స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం విద్యార్థినులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమాచారం అందించిన గంట తర్వాత రెండు 108 అంబు లెన్స్ రావడంతో విద్యార్థినులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మెరుగైన వైద్యం అందించాలి

**బోథ్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పిప్పల్‌దరి గ్రామంలోని తొడసం సోనే రావు ఇంట్లో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు వంట గ్యాస్ లీక్ అయి ఆరుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కాగా సోమవారం బోథ్ ఎమ్మార్వో సుభాష్ చంద్ర రెవెన్యూ అధికారులతో కలిసి పిప్పల్ దరి గ్రామానికి వెళ్లి ఆ ఇంటిని, వంటగదిని పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మార్వో మాట్లాడుతూ.. క్షత గాత్రులకు ప్రభుత్వం నుండి సహాయం అందే విధంగా చూస్తామన్నారు. డిప్యూటీ తహసిల్దార్ మల్లేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సునీత, తదితరులు ఉన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో మాజీ ఎంపీ సోయం బాపూరావ్, ఆత్మ చైర్మన్ రాజు పరామర్శించారు.



## 31 వరకు పోలీస్ యాక్ట్ అమలు

**నిర్మల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో ఈనెల 31 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు సమావేశాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. పోలీసుల అనుమతితోనే సభలు, సమావేశాలు నిర్వహించాలని ఎవరైనా చట్టాలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.



## బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



**బెల్లంపల్లి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని సోమవారం బెల్లంపల్లి బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు ఘనమైన ముక్కులను చెల్లించుకున్నారు. తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరునికి భక్తితో బోనాలు సమర్పించుకున్నారు. మనసు నిండా మొక్కితే కోరిన కోరికలు తీర్చే రాజరాజేశ్వరున్ని దర్శించుకుని అభిషేకాలు చేశారు. శ్రావణమాసం పూజలలో భాగంగా హనుమాన్ దేవాలయంతో పాటు నాగులమ్మ గుడిలోనూ మహిళలు పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీరాంభట్ల వేణుగోపాల శాస్త్రి, సతీష్ శర్మల నేతృత్వంలో శివాలయం గర్భగుడిలో శివలింగానికి వేదమంత్రోచ్ఛరణల మధ్య అర్చనలు, అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. నియోజకవర్గంలోని బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, రెబ్బెన, ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తారు. సోమవారం బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించుకున్న భక్తుల కోసం ఆలయ ఉద్యోగి భాను దంపతులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో బుగ్గ రాజేశ్వర అన్నదాన ట్రస్ట్ చైర్మన్ శ్రీదేవి శ్రీరాములు, ఆలయ ఈవో బాపిరెడ్డి, కన్నాల మాజీ సర్పంచ్ జిల్లపల్లి స్వరూప, అన్నదాన ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## వరి నాట్లకు ముందే
# పొలం గట్లను కత్తిరించాలి

**మందమర్రి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

వరి నాట్లు వేయడానికి ముందు వరి పొలంలో మడులను సూచించే గట్లను ఇరువైపులా తప్పనిసరిగా కత్తిరించాలని తద్వారా పొలం గట్లపై పెరిగే వివిధ రకాల కలుపుతో పాటు కీటకాలను నివారించవచ్చని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి కోరారు. మండలంలోని ఆదిల్ పేట గ్రామంలోని వ్యవసాయ పొలాలను సోమవారం పరిశీలించి రైతులకు గట్ల కత్తిరింపుపై అవగాహన కల్పించారు. పొలం గట్లు సైజులలో పెద్దగా ఉండడం ద్వారా ఎలుకలు ఆవాసం ఏర్పరచుకొని పంటకు నష్టం కలిగిస్తోందన్నారు. గట్లను కత్తిరించే సమయంలో బురద మట్టిని గట్టుపైనే వేయడం ద్వారా పొలం గట్లపై పెరిగే వివిధ రకాల కలుపు మొక్కల ఎదుగుదలను అడ్డుకొని తద్వారా చీడపీడల బెడదను పొలంలో తగ్గించుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా వరిలో గడ్డి చిలక కీటకము తనకున్న తొండం వంటి నిర్మాణాన్ని పొలం గట్టులోకి చొప్పించి గుడ్లు పెడుతుందని, గుడ్లు కీటకాలుగా మారి వరిపై ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయన్నారు. పొలం గట్లను కత్తిరించుట ద్వారా కీటకాన్ని ఆదిలోనే అదుపులో ఉంచుకోవడం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. రైతులు పొలాన్ని పరిశీలించు టకు శుభ్రమైన పొలం గట్లు అనుకూలంగా ఉంటాయని తెలిపారు.





## ప్రజావాణిలో అందిన దరఖాస్తులను
# సమన్వయంతో పరిష్కరించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- సమష్టి కృషితో పెంబి మండలానికి జాతీయ స్థాయిలో ఆస్పిరేషన్ బ్లాక్‌లో కాంస్య పతకం
- కలెక్టర్‌ను సన్మానించిన ఉద్యోగులు, సిబ్బంది
- ప్రజలు అవయవదానానికి ముందుకు రావాలి..





**నిర్మల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధులు నియంత్రించేందుకు పకడ్బందీ ప్రణాళికలను అమలు చేయాలని అన్నారు. జిల్లాలో ఇప్పటికే మూడుసార్లు జ్వర సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. పెంబి మండలానికి జాతీయస్థాయిలోనే ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో కాంస్య పతకం రావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. అధికారుల సమిష్టి కృషితో ఈ విజయం సాధ్యమైందని అన్నారు. పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ జాతీయస్థాయిలో మంచి స్థానంలో నిలవడం లో ఫ్రంట్ లైన్ వర్కర్స్ కృషి గర్వించదగ్గదని అన్నారు. గవర్నర్ చేతుల మీదుగా కాంస్య పతకాన్ని స్వీకరించినందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లను జిల్లా అధికారుల సంఘం తరపున సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు పెద్ద ఎత్తున అవయవదానానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన వైద్య, ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఉద్యోగి జొన్న వినోద్ కుమార్ దంపతులు మరణానంతరం వారి దేహాలను నిర్మల్ వైద్య కళాశాలకు విద్యార్థుల శిక్షణ కొరకు దానం చేయనున్నట్లు తెలిపారు. తన దేహాన్ని మరణానంతరం దానం చేయడం ఎంతో గొప్ప విషయం అని తెలిపారు. దీని ద్వారా వైద్య కళాశాల విద్యార్థులకు శిక్షణ, శాస్త్రీయ పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో అవయవ దానానికి ముందుకు రావాలని అన్నారు. అవయవదానంతో ఎంతోమంది జీవితాలలో మరణానంతరం కూడా వెలుగును నింపవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా దేహాన్ని దానం చేయడానికి ముందుకు వచ్చిన వినోద్ కుమార్ దంపతులను కలెక్టర్ అభినందించారు. ఇంతకుముందే వారి కుటుంబం నుంచి శరీరాలను పలు వైద్య కళాశాలలకు దానం చేసినందుకు వారిని ప్రశంసించారు. ఆయనను అదనపు కలెక్టర్లతో కలిసి పింఛనర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ సన్మానించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వాహనాలు అనుమతించాలని రాస్తారోకో



**జన్నారం, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
మండలం మీదుగా భారీ వాహనాలను అనుమతించాలని సామాజిక కార్యకర్తలు శ్రీరాముల భూమాచారి, బద్రీ నాయక్‌ల ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ నేపధ్యంలో ఇరువైపులా కొంత సేపు వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కవ్వాల్ టైగర్ జోన్ పేరిట విధించిన ఆంక్షల వలన మండల అభివృద్ధి కుంటుపడుతుందని, మండల వాసులు అన్ని విధాలుగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ ఆంక్షలు తొలగించి మండలం మీదుగా ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అన్ని రకాల వాహనాలను అనుమతించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల ప్రజలు అంబేద్కర్ విగ్రహం నుండి అటవీశాఖ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఎఫ్.డి.ఓ రామ్మోహన్ కు వినతిపత్రం అందజేశారు. భారీ వాహనాలను అనుమతించేలా అధికార యంత్రంగానికి డిమాండ్ ను తెలియజేయాలని కోరారు. కిందిస్థాయి అధికారుల చేతుల్లో లేదని, గతంలో ఇచ్చిన వినతిపత్రాలను పైఅధికారులకు పంపించడం జరిగిందన్నారు. సమస్యను పైస్థాయి అధికారులకు పంపించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమస్య పరిష్కారం కానీ యెడల అటవీశాఖ ఉద్యోగులనందు సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టడానికి వెనకడాబోమని మండల ప్రజలు అన్నారు. కార్యక్రమంలో విజయ ధర్మ, గోపాల్, పవన్, కృష్ణ, వినయ్, భరత్ కుమార్, వామన్, వాసు, కొమురవెల్లి సందీప్, దేవేందర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని వినతి

**బెల్లంపల్లి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలో ప్రధానమైన సమస్యలను పరిష్కరించాలని సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొట్లపల్లి సుభాష్ రావు ఆధ్వర్యంలో మండలానికి సంబంధించిన మాజీ సర్పంచులు అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని గ్రామపంచాయతీ లలో పారిశుధ్య పనులు అమలు చేయడం లేదని, మంచినీటి పైప్ లైన్లు లీకేజీలు అవుతున్నాయని, గ్రామ ప్రత్యేక అధికారులు గ్రామాలను సందర్శించడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామాలలో వీధి దీపాలను అమర్చడం లేదని, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం లేదని వారు పేర్కొన్నారు. విచ్చలవిడిగా తిరుగుతున్న పిచ్చికుక్కలను నివారించడంలో విఫలమవుతున్నారని పేర్కొన్నారు. అధికారులకు వినతిపత్రం అందించిన వారిలో మాజీ సర్పంచులు తాళ్లపల్లి అశోక్ గౌడ్, కారుకూరి వెంకటేష్, నాయకులు సింగం గణేష్ గౌడ్, గాజుల వెంకటేష్ గౌడ్, జిల్లపల్లి వెంకటస్వామి, కోట అశోక్, వెంబడి చిరంజీవి, యాటకార్ల తిరుపతి లు పాల్గొన్నారు.

## పంట ఉత్పత్తుల మద్దతు ధర పెంపు

**మంచిర్యాల, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
రైతు సంక్షేమంలో భాగంగా ఖరీఫ్ 2025-26 సీజన్‌కు గాను పంట ఉత్పత్తులపై కనీస మద్దతు ధరను పెంచడం జరిగిందని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండి. షహబుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. వరి సాధారణ రకానికి 2 వేల 369 రూపాయలు, గ్రేడ్ - ఎ రకానికి 2 వేల 389 రూపాయలు, జొన్నలు హైబ్రిడ్ రకానికి 3 వేల 699 రూపాయలు, మాల్దండి రకానికి 3 వేల 749 రూపాయలు, సజ్జలు 2 వేల 775 రూపాయలు, రాగులు 4 వేల 886 రూపాయలు, మొక్కజొన్న 2 వేల 400 రూపాయలు, కందులు 8 వేల రూపాయలు, పెసర్లు 8 వేల 768 రూపాయలు, మినుములు 7 వేల 800 రూపాయలు, పల్లికాయ 7 వేల 263 రూపాయలు, ప్రొద్దుతిరుగుడు గింజలు 7 వేల 721 రూపాయలు, సోయాబిన్ (ఎల్లో) 5 వేల 328 రూపాయలు, నువ్వులు 9 వేల 846 రూపాయలు, నైజర్ సీడ్ 9 వేల 537 రూపాయలు, పత్తి మధ్యరకం గింజ 7 వేల 710 రూపాయలు, పొడవు రకం గింజ 8 వేల 110 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి తమ పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

## యువత మాదకద్రవ్యాల బారిన పడి
# భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

- కుభీర్ ఎస్సై కృష్ణారెడ్డి
- విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదగాలి
- గంజాయి, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన



**కుభీర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
యువత మాదకద్రవ్యాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెడు అలవాట్లకు కనెక్ట్ కాకుండా చదువులపై ప్రత్యేక దృష్టిని సారించాలని చెడు అలవాట్ల బారిన పడితే బంగారు భవిష్యత్తు సర్వనాశనం అయిపోతుందని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, సరఫరా తదితర మత్తు పదార్థాలను వినియోగించినట్లయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 14500 కాల్ చేసి తెలపాలని కోరారు. పోలీసులు ఎల్లప్పుడూ మీకోసం సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇలాంటి వారిపై కఠినంగా పోలీస్ శాఖ వ్యవహరించనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ రైతు సమాజం కోసం యువత నడుం బిగించాలని నేటి విద్యార్థులే రేపటి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తారని కళాశాల ప్రిన్సిపల్ సునీల్ పేర్కొన్నారు. విద్యార్థులు యువకులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఇక్కడ విన్నది మీమీ గ్రామాల్లోని స్నేహితులకు, తోటి యువతకు చెప్పి వారు డ్రగ్స్ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏఎస్సై లక్ష్మణ్, అధ్యాపకులు విద్యార్థులు ఉన్నారు.

## స్పాట్ అడ్మిషన్ల కోసం
# దరఖాస్తు చేసుకోవాలి

**నిర్మల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ ప్రవేశాల కోసం పాలిసెట్ రాసిన అభ్యర్థులతో పాటు పదవ తరగతి పాసైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రమేష్ తెలిపారు. కళాశాలలో మెకానికల్ ట్రిపుల్ ఈ సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పాలీసెట్ 10వ తరగతి మెరిట్ ఆధారంగా స్పాట్ అడ్మిషన్లు కల్పించడం జరుగుతుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 897713946 నెంబర్ను సంప్రదించాలని సూచించారు.



## పసికందుతో రాళ్ల దారిలో
# ఇంటికి చేరిన పచ్చి బాలింత

**వాగుపై వంతెన లేక ప్రమాదమని తెలిసినా - జిల్లా కేంద్రానికి 7కిలో మీటర్ల దూరంలోనే దుస్థితి**

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచిన ఆదిలాబాద్ జిల్లాలోని నేటికి పలు గ్రామాలకు రహదారులు లేక ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతి నిత్యం కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి తమ పనులను పూర్తి చేసుకుంటున్న ప్రజలు నేటికీ జిల్లాలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. జిల్లా కేంద్రానికి కేవలం 7కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆదివాసి గ్రామానికి వెళ్లాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారంటే, ఇక మారుమూల గ్రామాల ప్రజల పరిస్థితి ఏంటో చెప్పాల్సిన పనిలేదు. ఆదిలాబాద్ రూరల్ మండలం పరిధిలోని చిట్యాల బోరి గ్రామానికి వెళ్లాలంటే రెండు వాగు లు దాటాల్సి ఉంటుంది. దానికి తోడు సుమారు 3 కిలోమీటర్ల మేర రోడ్డు లేక కనీసం ద్విచక్ర వాహనం వెళ్లలేని పరిస్థితి ఉందంటే ఆ గ్రామస్తుల దుస్థితి ఎంటో అర్థం చేసుకోవచ్చు. ఆరోగ్య సమస్యలు, ఇతరత్రా అత్యవసర సమస్యల వస్తే ఇక వారి కష్టాలు అన్నీఇన్ని కావు. వర్షాకాలంలోనైతే మరింత ఇబ్బందులు తప్పవు. తాజాగా ఇలాంటి ఘటన ఒకటి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆడ లక్ష్మీబాయి గర్భిణీ పురిటి నొప్పులతో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో చేరారు. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఆమె, రెండు రోజుల క్రితం ఆస్పత్రి నుంచి డిస్చార్జ్ అయ్యారు. ఐతే నాలుగు రోజుల పసికందులు పట్టుకొని జిల్లా కేంద్రానికి 7 కిలో మీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి బయలుదేరారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగిపొర్లడంతో వాగుపై వంతెన లేక ప్రమాదమని తెలిసినా పసికందును చేతిలో పట్టుకొని ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకొని వాగు దాటారు. గ్రామానికి చేరుకోవడానికి పచ్చి బాలింత సుమారు రెండు కిలోమీటర్ల మేర రాళ్ళురప్పలు దాటుతూ కాలినడకన వెళ్లాల్సి వచ్చింది.



## ప్రజావాణి దరఖాస్తులను
# సత్వరమే పరిష్కరించాలి

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
'ప్రజావాణి'లో వచ్చిన అన్ని దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూసి సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో వివిధ ప్రాంతాల ప్రజల వినతులు, ఫిర్యాదులకు సంబంధించిన 112 దరఖాస్తులను వారు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖలకు ఇస్తూ తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అర్జీలు పెన్షన్, ఇందిరమ్మ ఇళు, రహదారులు, విద్య, వైద్యం, మున్సిపాలిటీ, రెవెన్యు తదితర దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అన్నారు. ఈ గ్రీవెన్స్‌లో ఆర్డీఓ స్రవంతి, ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను సన్మానించిన అధికారులు

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఇటీవల జరిగిన నీతిఆయోగ్ నార్నూర్ బ్లాక్ రాష్ట్రస్థాయి సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్‌లో గవర్నర్ చేతుల మీదుగా స్వర్ణ పతకాన్ని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అందుకున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డు అందుకోవడం మన జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఇది ఒక వ్యక్తిగత విజయంగా కాకుండా, అందరి సమష్టి కృషి ఫలితంగా సాధించామని చెప్పారు.



# ఘనంగా మహిళల గాజుల పండగ



**బెల్లంపల్లి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలోని బుధ కుర్దు గ్రామంలో శివ గణేష్ భక్త మండలి ఆధ్వర్యంలో శ్రావణ సోమవారం సందర్భంగా గ్రామంలోని మహిళలందరూ సామూహికంగా గాజుల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. మహిళలు రంగురంగుల మట్టి గాజులను చేతికి నిండుగా వేసుకొని మహిళల ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని చాటారు. ఈ కార్యక్ర మంలో మహిళా నాయకులు సిరిపోతుల సత్యక్క, మండల మాజీ ఉపాధ్యక్షురాలు వెంబడి రాణి, బత్తుల మానస, చంద్ర గిరి జ్యోతి, దాసరి భాగ్యలక్ష్మి, సారం రాజేశ్వరి, గుంపుల భాగ్యలక్ష్మి, ముత్తె రమాదేవి,తొంగల లావణ్య, సారం మహే శ్వరి, వెంబడి లక్ష్మి, నల్లిమెల జ్యోతి, వెంబడి రమ, సారం లక్ష్మి, బియ్యాల రేవతి, దాసరి రాజేశ్వరి, సామల సరోజ, అంగల సుమ, దుబాసి రాజేశ్వరి, ముత్తెకళావతి, నలిమల లత, మల్లేశ్వరి, చిలుక పద్మ, తొంగల పద్మ, పొట్లపల్లి లక్ష్మి, అంగల కళావతి తదితరులు పాల్గొన్నారు.



## ధర్నాలో 'భోజన' కార్మికులు..
# పస్తుల్లో విద్యార్థులు

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయడంతో పాటు ఇతర సమస్యల సాధన కోసం జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. విధులు బహిష్కరించి కార్మికులు నిరసన తెలపడంతో బడుల్లో చదువుతున్న పిల్లలు పస్తులు ఉండాల్సి వచ్చింది. కొన్ని చోట్ల విద్యార్థులు ఇంటి నుండే మధ్యాహ్న భోజనం తెచ్చుకుని కడుపు నింపుకున్నారు.

## తల్లిపాల వారోత్సవాలను
# జయప్రదం చేయండి



**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
తల్లిపాల వారోత్సవాలు, పోషకాహార దినోత్సవం పోస్టర్లను సోమవారం అదిలాబాద్ కలెక్టరేట్ లో కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. తల్లి పాల ప్రాముఖ్యత, పిల్లల పెరుగుదలకు తల్లి పాలు ఎంత ముఖ్యమో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు తదితరులున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, ఆర్టీవో లోకేశ్వర్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కౌటాల మండలం గుడ్ల బోరి గ్రామానికి చెందిన బడికే సదాశివ్ తనకు 65 సంవత్సరాల వయసు ఉన్నందున వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం తక్కల్లపల్లి గ్రామానికి చెందిన నంది రజిత తాము పులికుంట గ్రామ శివారులో గల తమ భూమిలో సాగు చేసిన పత్తి పంటను వేరే వ్యక్తి ధ్వంసం చేసినందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం జనకాపూర్‌కు చెందిన పోరండ్ల రాజేశ్వర్ తన పేరిట పట్టా గల భూమి అడ ప్రాజెక్టు నిర్మాణంలో పోయినందున నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్ వాడికి చెందిన తిందాం భాగ్యలక్ష్మి నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన సుగుణ తాము చిన్న ఇంట్లో నివసిస్తున్నందున ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వాంకిడి మండలం కమాన గ్రామానికి చెందిన వసాకే రాధాబాయి కమన నుండి కణార్గాం గ్రామానికి వెళ్లే దారిని గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో వచ్చే దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాలల అదనపు గదులు, అంగన్వాడి కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సంబంధిత అధికారులు వసతి గృహాలను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా రుద్రాభిషేకం

**బెల్లంపల్లి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బెల్లంపల్లిలో శ్రీ సత్యసాయి సేవాసదనంలో 99వ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భకి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆద్యాంతం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

# పింఛన్ల పెంపులో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం




### ఆగస్టు 13న తాడోపేడో తేల్చుకుందాం
### ఆసిఫాబాద్ మహాగర్జన సన్నాహక సదస్సులో మంద కృష్ణమాదిగ

**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
వికలాంగులకు ఆరు వేలు, వృద్ధులు, వితంతువులకు నాలుగు వేల పెన్షన్ పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద మోసగాడని, ఈ విషయం పై ప్రశ్నించకుండా మౌనంగా ఉన్న ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసమర్ధుడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన మహాగర్జన సన్నాహక సదస్సులో మంద కృష్ణ పాల్గొని మాట్లాడారు. వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు మాట నెరవేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రశ్నించడంలో ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని, గడీలకే పరిమితమయ్యాడని విమర్శించారు. పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన హామీ ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం పింఛన్ పెంపు అమలు చేస్తోందన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇవ్వాల్సిన పింఛన్ సొమ్మును భూములు ఉన్న రైతులకు రుణమాఫీ కింద పంచారన్నరు. ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంచాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని తదితర 20 డిమాండ్లతో ఈనెల 13న హైదరబాద్‌లో మహాగర్జన సదస్సు నిర్వహిస్తామని ఈ సందర్భంగా మంద కృష్ణ స్పష్టం చేశారు. సదస్సుకు జిల్లాలోని వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు సత్యనారాయణ, ఇస్లాం, ఖయ్యుం, కేశవ్‌రావ్, నారాయణ పాల్గొన్నారు.



### బతికుండగానే
## వృద్ధురాలిని చంపేశారు
### సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన

**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
ఓ వృద్ధురాలు బతికుండగానే చనిపోయినట్లు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసిన సంఘటన జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన సోంబాయి (80) బతికి ఉండగానే మరణించినట్లు అధికారులు ధ్రువీకరణ పత్రం జారీ చేసి. వృద్ధురాలి పేరుమీద ఉన్న భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ సోమవారం కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వృద్ధురాలితో కలిసి ధర్నా చేపట్టారు. సబ్ కలెక్టర్ శ్రాద్ధ శుక్లా స్పందించి విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### ఆయిల్ ఫామ్‌కు మద్దతు
## ధర పెంచిన ప్రభుత్వం

**నిర్మల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
ఆయిల్ ఫామ్ తోటలు సాగుచేసిన రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ ఫామ్ గెలల రేటును పెంచిందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బివి రమణ తెలిపారు. జులై నుంచి తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ గెలల రేటును ఒక మెట్రిక్ టన్నుల గాను 180 52 రూపాయలకు పెంచడం జరిగిందని ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ తోటలు సాగుచేసిన రైతులు పంట చేతికొస్తున్న నేపథ్యంలో మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

## గొర్రెలకు నీలి నాలుక టీకాలు వేయించాలి

**తాండూర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
గొర్రెలకు నీలి నాలుక నాలుక టీకాలు వేయించాలి అని తాండూర్ మండల పశు వైద్య అధికారి డాక్టర్ నరసింహరావు అన్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలను సోమవారం వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్సింహారావు మాట్లాడుతూ నీలి నాలుక వ్యాధి ప్రధానంగా గొర్రెలలో నోరు, ముక్కు నుండి నీరు కారడం జ్వరం లాలజలం కారడం ఉంటుందని తెలిపారు. గొర్రెల పెంపకందారులకు వ్యాధి నివారణ గురించి పలు సూచనలు చేశారు. గొర్రెల కాపరులు అందరు వారి గొర్రెలకు తప్పనిసరిగా నీలి నాలుక టీకాలు వేయించాలని తెలిపారు.



ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మల్లేష్, కళ్యాణ్, గొర్రెలు పెంపకం వృత్తిదారులు సంఘం నాయకులు ఐలయ్య, పార్వతలు, కత్తెరయ్య, లక్ష్మణ్, మారుతి పాల్గొన్నారు.

## సమస్యలపై బాధ్యతాయుతంగా స్పందించాలి

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి జిల్లా నలు మూలల నుంచి వచ్చిన 38 మంది అర్జీదారుల సమస్యలను ఎజిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ విన్నారు. ఆయన మాట్లాడుతూ.. సరైన న్యాయం లభిస్తుందని ఎంతో నమ్మకంతో పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా స్పందించాలన్నారు. అనంతరం సంబంధిత పోలీసు స్టేషన్ బాధ్యులకు ఫోన్ చేసి బాధితుల సమస్యల పరిష్కారానికి దిశా నిర్దేశం చేశారు. నేరుగా జిల్లా ఎస్పీని కలిసి సమస్యలు విన్నవించుకోలేని వారు ఎస్పీ వాట్సాప్ నెంబరు 8712659973కు వివరాలను పంపించవచ్చున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తెలుపవచ్చుని సూచించారు. కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిణి కవిత, సిబ్బంది పాల్గొన్నారు.



## గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలి

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
బోథ్‌లోని పిప్పల్ ధరికి చెందిన తొడసం సోనేరావు ఇంట్లో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడ్డవారు ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సోమవారం ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.





### సింగరేణి పాలిటెక్నిక్‌లో
## మరో 66 సీట్లు ఖాళీ

**మందమర్రి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
మందమర్రి జీఎం కార్యాలయం నుండి పత్రిక ప్రకటన విడుదల చేశారు. సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్, సిసిసి నస్పూర్ నందు 2025-26 విద్యా సంవత్సరంకు సంబంధించి సింగరేణి కోటాలో మిగిలి ఉన్న 66 సీట్లు (సివిల్ -27, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ -06, మెకానికల్ -23. మైనింగ్-10) కు తక్షణ ప్రవేశాలు జరుగుతున్నాయి. గవర్నమెంట్ కన్వీనర్ కోటాలో మిగిలి ఉన్న సీట్లు ఈ నెల ఏడవ తేదీన కౌన్సెల్లింగ్ రోజున తెలుస్తాయి. ఈ అవకాశంను విద్యార్థులు సద్వినియోగము చేసుకోవాలని.. ఇతర కాలేజీలలో సీటు పొందిన విద్యార్థులు సీటు రద్దు చేసుకొని రావాలి. లేనిచో సీటు కేటాయించమని.. అలాగే రిజిస్ట్రేషన్, వివరముల కొరకుwww.scp. scpolytechnic.com సందర్శించి స్పాట్ అడ్మిషన్స్‌కు పాలిసెట్ 2025లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులతో సీట్లను భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## తల్లి పాలు అమృతతుల్యం



**లక్షెట్టిపేట, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
తల్లి పాలకు ప్రాధాన్యత ఇవ్వండని సిడిపిఓ రేష్మ అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ రేష్మ మాట్లాడుతూ... నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్టమని, తల్లి బిడ్డల శ్రేయస్సుకు తల్లిపాల వినియోగం ఎంతో అవసరమని వివరించారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లి పాలు పట్టించాలన్నారు. మొదటి ఆరు నెలలో తల్లిపాలు శ్రేష్టమని, డబ్బా పాలు వద్దు తల్లిపాలు ముద్దు అనే నినాదంతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శైలజ, జండర్ స్పెషలిస్ట్ విజయ, ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత, ఆర్థిక అక్షరాస్యత నిపుణులు లిపికా, అంగన్వాడి టీచర్స్ జ్యోతి, శంకరమ్మ, ఆయాలు తల్లులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 'తన తల్లికి కారణమైన వారిపై చర్యలు తీసుకోండి'

**బెల్లంపల్లి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
తన తల్లి షేక్ హలీమా బేగం మృతికి కారకులైన బెల్లంపల్లి వంద పడకల ఏరియా ఆసుపత్రి సిబ్బం దిపై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని గోల్ బంగ్లా బస్తీకి చెందిన షేక్ ముక్తియార్ సోమవా రం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గత నెల 28న రాత్రి తన తల్లి హై బీపీతో బాధపడుతుండ డంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా గేట్ సెక్యూ రిటీ గార్డ్ వచ్చి బీపీ చెక్ చేశారని అందులో మానిటర్ 90/60 చూపగా సిస్టర్‌కి తెలిపారని పేర్కొ న్నారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ ఇంజక్షన్‌తో పాటు టాబ్లెట్ ఇచ్చి మళ్లీ మ్యానువల్‌లో చెక్ చేయగా బీపి 220/60 చూపిందని పేర్కొన్నారు. దీంతో డాక్టర్ సిబ్బందిపై ఆగ్రహం చెంది మళ్లీ నాలుగు ఇంజక్షన్లు ఇచ్చి పంపింగ్ చేయడం ప్రారంభించినట్లు ముక్తియార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. పంపింగ్ చేసే సమయంలో డాక్టర్ హుటాహుటిన పోలీసులను పిలిపించి పల్స్ నడుస్తున్నట్లు చూపించి మంచిర్యాలకు రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు. డాక్టర్ ఇచ్చిన సమాచారంతో అంబులెన్స్ డ్రైవర్ కి ఫోన్ చేస్తే డీజిల్ పోస్తేనే వస్తానని సమాధానం చెప్పినట్లు పేర్కొన్నారు. తాము 108 అంబులెన్స్‌లో తన తల్లిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందినట్లు ముక్తియార్ ఫిర్యాదులో పేర్కొ న్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి ఒకరి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని షేక్ ముక్తియార్ జిల్లా కలెక్టర్‌ను కోరారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార దీపక్

మంచిర్యాల, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించే విధంగా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు ప్రజలు మున్సిపాలిటీ లోని 2వ వార్డులో గల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా కాకుండా కాపాడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి సమీకృత కూరగాయల మార్కెట్లో లక్కీ డ్రా పద్ధతి ద్వారా ఎంపికైన దుకాణ లబ్ధిదారులు తమ దరఖాస్తులో లక్కీ డ్రా ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు అలాట్మెంట్ లెటర్ ఇచ్చి షాపు లీజు అగ్రిమెంట్ చేయాలని కోరారు. విద్యార్థి జన సమితి ప్రతినిధి బచ్చలి ప్రవీణ్ కుమార్ తన దరఖాస్తులో మందమర్రి మండలం పొన్నారం గ్రామంలోని వసతి గృహాన్ని అందుబాటులోకి తెచ్చి విద్యార్థులకు



న్యాయం చేయాలని కోరారు. హాజీపూర్ మండలం గుడిపేట, ఆర్ అండ్ ఆర్ కాలనీవాసులు ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముంపుకు గురైన వారికి పునరావాసంలో భాగంగా గ్రామ అభివృద్ధి కొరకు కేటాయించిన భూమిని కొందరు అక్రమంగా ఆక్రమిస్తున్నారని, ప్రజా ప్రయోజనార్థం కేటాయించబడిన భూమిని కాపాడాలని కోరారు. జైపూర్ మండల కేంద్రానికి చెందిన సహెరాబాను తనకు ఇంటి స్థలం ఉందని ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపచేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం సబ్బెపెల్లి గ్రామానికి చెందిన గెడ మారు, తన కుటుంబ సభ్యులు గ్రామ శివారులో గల తమ భూమిలో తాతల నుండి సాగు చేసుకుంటున్నామని, ఇప్పుడు కొందరు తమను భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఈ విషయమై విచారించి తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చెన్నూరు పట్టణంలోని కుమ్మరి బొగుడ ప్రాంతానికి చెందిన సర్వర్ ఉన్నిసాబేగం తనకు రావలసిన వితంతు పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భీమిని మండలం సికినం గ్రామానికి చెందిన గాదె పోశక్క తనకు గల భూమి పట్టా పాస్ పుస్తకంలో తక్కువ విస్తీర్ణం నమోదు అయిందని, మిగిలిన భూమి వేరే వారి పేరిట నమోదు అయిందని, ఈ పొరపాటున సవరించి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం షెట్పల్లి గ్రామానికి చెందిన చింతల అర్జయ్య గ్రామ శివారులో తనకు గల భూమిలో కొందరు దౌర్జన్యంగా చొరబడి భూమిని దున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండల కేంద్రానికి చెందిన కొరివి కత్తెరసాల తాను మరో ఇద్దరితో కలిసి భూమి కొనుగోలు చేశానని, వారిలో ఒకరు చనిపోవడంతో మొత్తం భూమిని తమకు తెలియకుండా విక్రయించారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం

ముథోల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)

తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యకరమని తరోడ అంగన్వాడి కేంద్రం కార్యకర్త హర్షయా తబుసం అన్నారు. ముథోల్ మండలంలోని తరోడ అంగన్వాడి కేంద్రం 2లో సోమవారం తల్లి పాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలను తాగించాలన్నారు. పిల్లలకు తల్లిపాలు అమృత లాంటిదిన్నారు. గర్భిణీలు, బాలింతలు తప్పని సరిగా పోషకారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్వాడి కేంద్రం ద్వారా పంపిణీ చేస్తున్న పోషకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణీలు, బాలింతలు తప్పకుండా ఎప్పటికప్పుడు వైద్యుల సూచన, సలహాలను పాటించాలన్నారు. ఆనంతరం పిల్లలకు అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమైక్య అధ్యక్షురాలు ముత్తవ్వ, ఆశా కార్యకర్త అప్సరీ బేగం, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భీంపూర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని భీంపూర్ ఎస్సై పీర్ సింగ్ సూచించారు. సోమవారం మండలంలోని పిప్పల్కోటి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పంటచేలలో గంజాయి సాగు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు. అనుమానిత కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.



# గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

## ఐటీడీఏ ఏఓ దామోదర్ స్వామి

ఉట్నూర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)

గిరిజనుల సమస్యల పరిష్కారం పై అధికారుల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఎ.ఓ. దామోదర్ స్వామి అన్నారు. సోమవారం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఉట్నూరు మండలం మార్క గూడ గ్రామానికి చెందిన కనక భగవంతు వ్యవసాయ సాగు కొరకు సోలార్ మంజూరు చేయాలని, సాత్నాల మండలం పాలయి తండా గ్రామానికి చెందిన సోము తనకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టా ఇప్పించాలని కోరడంతో పాటు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమస్యలను



పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. ఎ.ఓ. మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# కలెక్టర్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)

సంపూర్ణత అభియాన్‌లో ఉత్తమ ప్రదర్శనకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రేను ఆసిఫాబాద్ కాంగ్రెస్ అధ్యక్షులు విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చరణ్, ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు జమీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ సక్సెస్

మంచిర్యాల, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతమైనట్లు సీపీ అంబర్ కిషోర్ తెలిపారు. కమీషనరేట్ వ్యాప్తంగా 193 మంది బాలలకు విముక్తి కలిగించి, 18 కేసులు నమోదు చేసినట్లు సోమవారం వెల్లడించారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని,బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో మెనూ ప్రకారం పౌష్టికారమైన ఆహారము అందించాలి

ఉట్నూర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులను తమ సొంత పిల్లల్లా భావించి వారికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం తప్పనిసరిగా పౌష్టికారమైన ఆహారము సమయానుకూలంగా అందేలా హెచ్ ఎం వార్డెన్లు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ అలుగు వర్షిని సంబంధిత హెచ్‌ఎంలకు సూచించారు. సోమవారం నాడు ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం నుండి ఐటిడిఏ పీవోలు, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారినిలు, డిటిడిఓలు, రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎం వార్డెన్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కల్లూరు లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉదయం అల్పాహారం తిని అస్వస్థకు గురి అయినందున దానికి సంబంధించిన కారణాలను అడిగి తెలుసుకుని ఇకముందు ఇటువంటి పరిణామాలు జరగకుండా చూడాలని అన్నారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలలో ఫుడ్ కమిటీ సభ్యులుగా పిల్లలను నియ




మించాలని, నెలకు ఒకసారి ఫుడ్ కమిటీని మార్పులు చేయాలని, పిల్లలకు వడ్డించే ఆహారాన్ని సంబంధిత హెచ్‌ఎం వార్డెన్ మరియు ఉపాధ్యాయులు టెస్ట్ చేసి ఫుడ్ మంచిగా ఉందని సర్టిఫై చేసి 15 నిమిషాలు తర్వాత పిల్లలకు వడ్డించాలని, దానికి సంబంధించిన రిపోర్టు ఏ రోజుకి ఆ రోజు తనకు పంపించాలని అన్నారు రాత్రిపూట మిగిలిన ఆహారాన్ని ఎప్పటికప్పుడు బయటపడే వేయాలని, వంటగది వంట చేసే సిబ్బంది శుభ్రత పాటించాలని, మెస్ కమిటీ సభ్యులు వార్డెన్ ఇచ్చిన సామానులను కరెక్ట్ గా చెక్ చేసుకోవాలని, మూడు రోజులకు ఒకసారి స్టోర్ రూమ్ లోని సామాన్లు చెక్ చేసుకోవాలని, జీసెస్ వారు సరఫరా చేసే సామాన్లు ఎక్స్పరి డేట్ అయిపోతే వెంటనే తీసివేయాలని, కూరగాయలను జాగ్రత్తగా భద్రపరచాలని, కొత్త మెనూ సంబంధిత పిహెచ్సి డాక్టర్లు ఎస్సై తాసిల్దారులకు సంబంధించిన ఫోన్ నెంబర్లు పాఠశాల ముందు ప్రదర్శించాలని, హెచ్‌ఎం వార్డెన్లు ఎవరైనా సెలవు పెడితే తన దృష్టికి అడిషనల్ సెక్రెటరీ దృష్టికి తీసుకొని వచ్చిన తర్వాతనే సెలవులు పెట్టాలని, ఎం హెచ్ ఎం వార్డెన్ సిబ్బంది అందరూ ఐకమత్యంగా ఉండాలని, సంబంధిత హెచ్‌ఎంలు ఇన్స్టిట్యూషన్ మొత్తానికి బాధ్యత వహించాలని ఏదైనా ఇన్స్టిట్యూషన్లో పిల్లలు గనుక అస్వస్థతకు గురి అయితే వెంటనే జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, సంబంధిత ట్రైబల్ వెల్ఫేర్ అధికారులకు, డిటిడివోలకు, పిల్లల తల్లిదండ్రులకు సమాచారం అందించాలని ఈ లోపల పిల్లలను దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించాలని, గురుకులాలలో, ఆశ్రమ పాఠశాలల్లో ఏమైనా పోస్టులు ఖాళీగా ఉంటే ఈనెల 14వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని, పిల్లలకు మాత్రం ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. అనంతరం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా మాట్లాడుతూ గురుకులాలలో కానీ, ఆశ్రమ పాఠశాలలో కానీ వంట చేసే విషయంలో పొరపాట్లు దొరలకుండా జాగ్రత్తలు తీసుకునేలా ప్రిన్సిపాల్ హెచ్‌ఎం వార్డెన్ లకు ప్రత్యేక సమావేశం పెట్టి ఆదేశాలు జారీ చేస్తామని కమిషనర్‌కు తెలిపారు.



## గ్రామీణ స్థాయి నుండి అభివృద్ధికి
# సమిష్టిగా కృషి చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో గ్రామీణ స్థాయి నుండి ప్రజా సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే విధంగా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గణపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎ.పి.ఓ.లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సాంకేతిక సహాయకులతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్.ఎం.ఎం.ఎస్.) నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ స్థాయి నుండి అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా చేపట్టి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎన్.ఎం.ఎం.ఎస్. నిర్వహణలో భాగంగా సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని, ఫొటోలు అప్లోడింగ్, జియో ట్యాగింగ్ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పరిధిలో పరిమితి ఉన్న మేరకు మురుగు కాలువల నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు, మొక్కల పెంపకంలో ఉద్యాన మొక్కల అభివృద్ధిపై దృష్టి సారించాలని, పత్తి పంట సాగులో అంతర పంటగా మునగ సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని, ఇందులో భాగంగా మండలానికి ముగ్గురు / నలుగురు రైతులను ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టు క్రింద సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల సొంత భవనాలు ఉండే విధంగా భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మండల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల నిర్వహణకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, నాటిన మొక్కల సంరక్షణ, నీటి సరఫరా సంబంధిత బిల్లులు సమర్పించాలని, సామాజిక ఇంకుడు గుంతల ఏర్పాటును అభివృద్ధి చేయాలని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ప్రహరీగోడ నిర్మాణాలను దాదాపుగా పూర్తయ్యాయని, వంటశాల, మూత్రశాలలు లేని పాఠశాలలను గుర్తించి పనులను చేపట్టాలని, బాలురు, బాలికల మూత్రశాలలు వేరువేరుగా ఉండాలని, ప్రభుత్వ పాఠశాలలలో సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



# వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

**దండేపల్లి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ ఆదేశించారు. సోమవారం దండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్సీ) తో పాటు జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఎలాంటి అనుమతి లేకుండా సెలవులో ఉన్న జన్నారం పీహెచ్సీ వైద్యురాలు లక్ష్మికి షోకాజు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్ఓ వైద్యాధికారులకు, పారామెడికల్ సిబ్బందికి, సూపర్ వైజర్లకు సూచనలిచ్చారు. పీహెచ్సీలలో, సబ్ సెంటర్లలో వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ఎలాంటి సెలవులుండవని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సెలవులు తీసుకోవాలని, మంజూరు చేసుకోవాలన్నారు.

**అవసరమున్న చోట వైద్య శిబిరాలు..**

సీజనల్ వ్యాధులు ప్రభావిత గ్రామాలలో వైద్య శిభిరాలు ఏర్పాటు చేయాలని డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ హరీష్ రాజ్ కోరారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసే గ్రామాల్లో ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఈ శిబిరము పెట్టినప్పుడు గ్రామపంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటూ ఇంటింటికి తిరిగి రోగులను గుర్తించి శిబిరాలకు సహకరించేలా చూడాలని కోరారు. అదే విధంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని కోరారు. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామపంచాయతీ సెక్రటరీ ద్వారా గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతపైన, దోమలు నిలువ లేకుండా, దోమలార్వాలు ఉండకుండా చర్యలు చేపట్టాలని, ఫాగింగ్ కార్యక్రమాలు చేయాలని డ్రైడే ప్రతి వారంలో రెండు రోజుల పాటు (మంగళ, శుక్రవారం) చేయాలని, అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



**గైర్హాజరు వైద్యులకు షోకాజు నోటీసు..**
**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్**

**ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో వైద్య శిబిరాలు..**

పీహెచ్సీల పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలను వైద్యులు, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు సందర్శించాలని డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ హరీష్ రాజ్ ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు అందిస్తున్న భోజనము, వంటగదిని పరిశీలించి వంట చేసే వారికి పరిశుభ్రతపై అవగాహన కలిగించాలన్నారు. ఫార్మసిస్టులందరూ ఈ సంజీవనిలో నమోదు చేయాలని, ఉప కేంద్రంల వారీగా మందులను అందజేయాలని, పరీక్షలు చేసి వైద్యం అందించాలన్నారు. అదే విధంగా తెలంగాణ డయగ్నస్టిక్స్ కు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి శాంపిల్స్ పంపించడం, రిపోర్ట్సను తెలుసుకొని ఇతర ప్రివెంటివ్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ కేసులు ఎక్కువ నమోదు అవుతున్నందున వాటిపైన పరీక్షలు చేస్తూ అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా రౌండ్ క్లాక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాయంత్రం ఉండే వైద్య సిబ్బంది వివరములను గోడ పైన ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అసంక్రమణ వ్యాధులు (ప్రోగ్రామ్ ఆఫీసర్) డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ హరీష్, డెమో బుక్క వెంకటేశ్వర్, వైద్య సిబ్బంది, ఫార్మసిస్టులు, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ దోత్రేకు సన్మానం

**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

ఆదివాసి, గిరిజనుల సంక్షేమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాను అత్యున్నత స్థానంలో నిలిపినందున జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేను జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ నెల 2వ తేదీన రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో గల రాజ్ భవన్లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినందున గవర్నర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ పురస్కారం తీసుకున్న సందర్భంగా కలెక్టరేట్ లోని అన్ని విభాగాల పర్యవేక్షకులు, సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన నూతన సీఐ

**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ జిల్లాలో పి.బాలాజీ వరప్రసాద్ ఆసిఫాబాద్ సీఐగా, ఎం. సంజయ్ రెబ్బెన సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇద్దరూ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ను ఆయన కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వీరిరువురికీ శుభాకాంక్షలు తెలిపారు. నేరాల నివారణ, భద్రత, కమ్యూనిటీ పోలీసింగ్పై దృష్టి పెట్టాలని సూచించారు.



# రాష్ట్రంలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారే

**మందమర్రి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో రాబోయేది బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్గౌడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్లు తెలిపారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన ఏ ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చలేదన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికే పరిమితమైందని, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో పార్టీ నూత న అధ్యక్షుడిగా రాంచందర్ రావు నియమితులైన తర్వాత ప్రజల సమ స్యలపై పోరాట కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నా రు. రాష్ట్ర అధ్యక్షుడు పలు నియోజకవర్గాల పర్యటనకు సిద్ధమ య్యా రన్నారు. నేడు మందమర్రిలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్రావు



పర్య టించనున్నారని తెలిపారు. ఆయనకు సింగరేణి, ప్రజల సమస్యల ను విన్నవిస్తామన్నారు. స్వాగతం యాత్రను కూడా ఏర్పాటు చేస్తు న్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు తరలి రావాన్నారు. ఈ సమా వేశంలో పార్టీ జిల్లా, పట్టణ నాయకులు అందుగుల శ్రీనివాస్, దీక్షి తులు, రొడ్డ మోహన్, సంజీవరావు, మల్యాల రాజమల్లు, వేణు, జనా ర్ధన్, ధన్సింగ్, రవి, శరత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధ దంపతులకు ఎస్పీ అభినందన

**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ మండలం బూరుగుడ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు ఆనందరావు-శకుంతల జంట, మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో మొదటి స్థానం సాధించారు. కాగా సోమవారం వీరిని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అభినందిస్తూ కృషి, తపన, పట్టుదల ఉంటే వయసు అడ్డుకాదని ప్రోత్సాహం తెలిపారు. జిల్లా ఖ్యాతిని మరింత పెంచినందుకుగాను ప్రత్యేక ప్రశంసలు అందించారు.





## శాంతి భద్రతలకు కృషి చేయాలి

### ఎస్పీ కాంతిలాల్ పాటిల్

**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చిన సిఐలు బాలాజీ వరప్రసాద్, సంజయ్ సోమవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయ డంతో పాటు నేరాల నియంత్రణ నిషేధిత పదార్థాల రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖపై ప్రజ లకు మరింత నమ్మకం కలిగేలా పనిచేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎస్పీ తన కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితులు మధ్యవర్తుల మాటలు నమ్మి మోస పోవద్దని పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు.

## బీసీ రిజర్వేషన్ కోసం పోరాటం




**నిర్మల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

జనాభా ప్రాతిపాదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు సిపిఎం పోరాటం కొనసాగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెస్లీ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి 42 శాతం రిజర్వేషన్ కోసం కులాల బీసీలతో జేఏసీ ఏర్పడి పోరాటం చేస్తామని తెలిపారు. బీసీల రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెరిగితేనే రాజ్యాధికారం దక్కుతుందని అందుకు బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నూతన కుమార్ గౌతమ్ పాల్గొన్నారు.

## పొన్కల్‌లో సామాజిక తనిఖీ

**జన్నారం, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలం పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీలో సోమవారం ఈజీఎస్ సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహించారు. పంచాయతీ ఈవో రాహుల్ మాట్లాడుతూ.. 2024 -25 సంవత్సరంలో మేజర్ గ్రామపంచాయతీలో జరిగిన ఈజీఎస్ పనులపై తనిఖీ బృందం సభ్యులు తనిఖీలు చేశారు. ఆ నివేదికను ప్రజల ముందు ఉంచుతున్నామన్నారు. ఈనెల 5న మండల కేంద్రంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు ఈజీఎస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



# లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలి : అడిషనల్ కలెక్టర్ రేవయ్య

**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

విద్యార్థి దశ నుండే లక్ష్యాన్ని ఎం చుకొని ముందుకు సాగాలని సాంఘిక సంక్షే మ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి, మహారాష్ట్రంలోని ఉస్మానాబాద్ అడిషనల్ కలెక్టర్ రేవయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థి రేవయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఏఎస్ రేవయ్య మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదివి సివిల్స్ ర్యాంకు సాధించి మహారాష్ట్రలో అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. శ్రద్ధతో చదివితే లక్ష్యాన్ని చేదించడం కష్టతరం కాదని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఏకాగ్రతతో విన్నాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానం చేరుకోవాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని అన్నారు. చదువు అంటే భయం ఉండవద్దని అప్పుడే ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎంతో కష్టపడి చదివిపిస్తున్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత పిల్లలపై ఉంటుందని తెలిపారు. ఈ పాఠశాలలో చదివి ఇప్పుడు విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. నాకు విద్య బుద్ధులు చెప్పిన గురువులకు పాదాభివందనం చేస్తున్నానని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ



కార్యక్రమంలో ప్రిన్సిపల్ యాదగిరి, సిబ్బంది మహేష్ చంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులు నింపాలని బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

**మంచిర్యాల, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**



కాలేశ్వరం ప్రాజెక్టు నుంచి కన్నెపల్లి పంపు హౌస్ ద్వారా నీళ్లు ఎత్తి పోసి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు నింపాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేపట్టిన 'చలో కన్నెపల్లి' కార్యక్రమంలో మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధుకర్, కోరుకంటి చందర్, రసమయి బాలకిషన్, రవి శంకర్, దాసరి మనోహర్, విద్యాసాగర్ రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు చెల్మేడ లక్ష్మీ నరసింహ రావు, దావ వసంత, రఘువీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ అధికారుల పొలం బాట

**మందమర్రి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

మండలంలోని వెంకటపూర్ గ్రామంలో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్ఈ జాడి ఉత్తమ్, డిఈ ఎంఎ కైసర్ లు మాట్లాడారు. రైతులకు విద్యుత్ మీటర్లకు కెపాసిటర్లు బిగించుకోవడం, వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి ఏఈ ఏ ప్రభాకర్, లైన్ మెన్ సతీష్, మండల కాంగ్రెస్ నాయకులు కొట్టే సంపత్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుంది



**ఉట్నూర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుందని ఉట్నూర్ జి.సి.సి. డివిజన్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ అన్నారు. గిరిజన సహకార సంస్థ పరిధిలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు ప్రభుత్వం సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో ఉట్నూర్ డివిజన్‌లో పదోన్నతి పొందిన 10 మంది ఉద్యోగులను ఉట్నూర్ జిసిసి కార్యాలయంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ జి.సి.సి. డివిజన్ మేనేజర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుందని అన్నారు. పదోన్నతి పొందిన ఉద్యోగులు మరింత బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజా సేవలో జవాబుదారిగా ఉండాలని, సంస్థ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన ఇస్తారి, మనోహర్, రమేష్, గోవింద రావు, సదాశివ్, గణేష్, చందు, రూప్లా, లక్ష్మణ్, జంగు, డివిజన్ కార్యాలయ సిబ్బంది లింభారావు, సత్యనారాయణ, సంతోష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**మంచిర్యాల, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన బీసీ రిజర్వేషన్ సాధన ధర్నాకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ధర్నా విజయవంతానికి టీఎన్జీవో జిల్లా బృందం వెళుతుందని ప్రకటించారు.




## ఫోన్లు పోయినవారు వెంటనే తెలియచేయండి

**నిర్మల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**



జిల్లాలో సెల్ ఫోన్లు పోయినవారు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పెట్టుకుంటే వాటిని పట్టుకొని పోగొట్టుకున్న వారికి అందించడం జరుగుతుందని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ లబ్ధిదారులకు 70 మందికి సెల్‌ఫోన్‌లను అందించారు. ఫోన్లు పోయినప్పుడు ఆన్‌లైన్‌లో మీ సేవలో దరఖాస్తు చేసుకొని పోలీస్ అప్పగించాలని సూచించారు. వీటి విలువ 8.40 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ జన్మదిన వేడుకలు

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జన్మదిన వేడుకలను సోమవారం అట్టహాసంగా జరుపుకు న్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వారిని దర్శించుకోవడానికి వెళ్ళడంతో పార్టీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం నేతృత్వంలో జన్మదిన వేడుకలు సాగాయి. ఎమ్మెల్యే పుట్టిన రోజును పురస్కరించు కుని ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం సైతం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువకులు, పార్టీ నేతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రక్తదానం చేసిన వారికి నాయకులు పండ్ల రసం అందించి అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. తమ అభిమాన నేత నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం ఆకాంక్షించారు.









## మహేష్ బాబు మేనియా షురూ..

మహేష్ బాబు పోకిరి సినిమాతో మొదలైన రీ రిలీజ్ ట్రెండ్.. కొనసాగుతూనే ఉంది. ఒకప్పుడు సూపర్ హిట్స్ గా నిలిచిన స్టార్ హీరోల సినిమాలను మరోసారి తెరపై చూసేందుకు ఇష్టపడుతున్నారు ప్రేక్షకులు. ఇలా ఇప్పటికే విడుదలైన చాలా సినిమాలు రీ రిలీజ్ లో కూడా రికార్డు స్థాయి నంబర్స్ రాబట్టాయి. ఇప్పుడు మహేష్ బాబు 'అతడు' సినిమా రీ రిలీజ్ అవుతుండగా భారీ స్పందన వస్తోంది. ఆగస్టు 9న మహేష్ బాబు 50వ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా రీ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. సినిమా రిలీజ్ ఇంకా ఐదు రోజులు ఉండగానే అడ్వాన్స్ బుకింగ్స్ లో జోరు చూపిస్తోంది. అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ సినిమా మరోసాయారి 70mm స్క్రీన్ పై చూసేందుకు ఆసక్తిగా ఉన్నారు ఫ్యాన్స్. ఇప్పటికే హైదరాబాద్ లోని సుదర్శన్ 35mm, దేవి 70mm వంటి ప్రధాన థియేటర్స్ లో ఆగస్టు 9కి షోలన్నీ హౌస్ ఫుల్ అయ్యాయి. ముఖ్యంగా ఓవర్ సీస్ లో అతడు అడ్వాన్స్ బుకింగ్స్ కొత్త సినిమాల కంటే ఎక్కువగా ఉండడం.. 'అతడు' క్రేజ్ ఏ రేంజ్ లో ఉందో అర్థమవుతోంది. నైజాంలో ఈ సినిమా రీరిలీజ్ హక్కులను ఏషియన్ సినిమాస్ కొనుగోలు చేయగా.. ఏపీలో ఏరియాల వారిగా పోటీపడి మరీ అతడు రీరిలీజ్ హక్కులు భారీ ధరకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. ఈ సినిమా రీరిలీజ్ హక్కులు రూ. 3కోట్లకు పైగా పలికినట్లు సమాచారం. ఒక రీరిలీజ్ సినిమా ఈ రేంజ్ లో ప్రీరిలీజ్ బిజినెస్ చేయడం రికార్డ్ అనే చెప్పాలి. గతంలో రీరిలీజైన మహేష్ బాబు సినిమాలు ఒక్కడు, మురారి, ఖలేజా కంటే రికార్డ్ స్థాయి వసూళ్లను రాబట్టే అవకాశం ఉంది.

## స్టైలిష్ లుక్ లో అక్కినేని కోడలు ఫొటోలు అదుర్స్



అక్కినేని కోడలు శోభిత నెట్టింట లేటెస్ట్ ఫొటోలను షేర్ చేసింది. స్టైలిష్ అవుట్ శోభిత గ్లామర్ షో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. మీరు కూడా చూసేయండి. అక్కినేని కోడలు శోభిత సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్ గా ఉంటుంది. లేటెస్ట్ ఫ్యాషన్ లుక్ లో దర్శనమిస్తుంది. తాజాగా బ్రౌన్ అండ్ బ్లాక్ లో ఈ బ్యూటీ స్టన్నింగ్ ఫోజులు వైరల్ అవుతున్నాయి. 2024 లో అక్కినేని నాగచైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకుంది శోభిత. పెళ్లి తర్వాత సినిమాల్లో పెద్దగా కనిపించలేదు.. ప్రస్తుతం తన మ్యారీడ్ లైఫ్ ని ఎంజాయ్ చేస్తోంది. చైతన్య, తాను ఇద్దరూ కలిసి వెకేషన్స్ చేస్తున్నారు. ఇక శోభిత సినిమా కెరీర్ విషయానికి వస్తే.. సినిమా కెరీర్ విషయానికి వస్తే.. తెలుగులో గూఢచారి, పొన్నియన్ సెల్వన్ వంటి సినిమాలతో పాపులరైన శోభిత మంకీ మ్యాన్ అనే సినిమాతో హాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఇటీవలే 'లవ్ సితార' అనే సినిమాలో మెరిసింది.




## దుల్కర్ సల్మాన్ కి క్లాప్ కొట్టిన నాని..

నటుడు దుల్కర్ సల్మాన్ మరో కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు. తన 41వ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. DQ41 గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు డెబ్యూ డైరెక్టర్ రవి నేలకుడిటితో దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మేరకు ఈరోజు హైదరాబాద్ లో పూజ కార్యక్రమాలతో సినిమాను గ్రాండ్ గా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. హీరో నాని సినిమాకు క్లాప్ కొట్టగా.. డైరెక్టర్ బుచ్చిబాబు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నాని, గున్నం సందీప్, రమ్య గున్నం స్క్రిప్ట్ను చిత్ర బృందానికి అందజేశారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తిచేసుకున్న ఈ చిత్రం ఈరోజు నుంచే రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టింది. సినిమాలోని హీరోయిన్ , ఇతర నటీనటుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. దుల్కర్ ప్రస్తుతం కాంతా సినిమా చేస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా టీజర్ విడుదలవగా సూపర్ హిట్ రెస్పాన్స్ సొంతం చేసుకుంది. సీతారామం, లక్కీ భాస్కర్ వంటి సినిమాలతో తెలుగు ఆడియన్స్ లో ఫుల్ క్రేజ్ సంపాదించుకున్నారు నటుడు దుల్కర్.

## త్రిప్తికి ఊరట

ఇండస్ట్రీలో అడుగు పెట్టిన దాదాపు ఐదేళ్ల తర్వాత 'యానిమల్' సినిమాతో త్రిప్తి డిమ్రికి బ్రేక్ దక్కింది. రణబీర్ కపూర్ హీరోగా సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో వచ్చిన యానిమల్ సినిమాలో త్రిప్తి చిన్న పాత్రలోనే నటించింది. అయినా కూడా హీరోయిన్‌గా నటించిన రష్మిక మందన్న పాత్ర కంటే త్రిప్తి పాత్రకు వెయిట్ ఎక్కువ లభించింది. అంతే కాకుండా ఆ సినిమాతో త్రిప్తి బాలీవుడ్‌లో ఒక్కసారిగా స్టార్ అయింది. యానిమల్ విడుదలకు ముందు త్రిప్తి ఇండస్ట్రీలో సగానికి పైగా తెలియదు. కానీ ఎప్పుడైతే యానిమల్ హిట్ పడిందో అప్పటి నుంచి త్రిప్తి గురించి చర్చ మొదలైంది. 2023 చివర్లో యానిమల్ సినిమాతో వచ్చిన త్రిప్తికి ఆ ఒక్క సినిమా కారణంగా గత ఏడాది అంటే 2024లో ఏకంగా మూడు సినిమాలు చేసే అవకాశం దక్కింది. త్రిప్తి వరుస సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేసింది.గత ఏడాదిలో త్రిప్తి నటించిన బాడ్ న్యూజ్, విక్కీ విద్యా కా వో వాలా వీడియో, భూల్ భులయ్యా 3 సినిమాలు విడుదల అయ్యాయి. మూడు సినిమాలు కమర్షియల్‌గా అనుకున్న స్థాయిలో ఆడలేదు. దాంతో త్రిప్తి పై మెల్ల మెల్లగా నెగిటివిటీ ప్రారంభం అయింది. ఈ ఏడాది అది కాస్త ఎక్కువ అయింది. త్రిప్తిని కావాలని కొందరు బాలీవుడ్‌కు చెందిన సీనియర్ హీరోయిన్స్ పీఆర్ టీమ్స్ టార్గెట్ చేశాయి. నెగిటివ్‌గా ప్రచారం చేస్తున్నారు అనే చర్చ మొదలైంది. ఆ సమయంలో ప్రభాస్ స్పిరిట్ సినిమా నుంచి దీపికా పదుకునేను తొలగించి త్రిప్తిని ఎంపిక చేయడంతో ఒక్కసారిగా ఆమె గురించిన చర్చ జరగడం మొదలైంది. త్రిప్తిని డీగ్రేడ్ చేస్తూ విమర్శలు చేసిన వారు చాలా మంది ఉన్నారు. వరుసగా ఫ్లాప్స్ పడుతున్న సమయంలో, తీవ్రమైన విమర్శలు ఎదుర్కొంటున్న సమయంలో త్రిప్తికి 'ధడక్ 2' కాస్త ఊరట కలిగించిందని చెప్పాలి.జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన మొదటి చిత్రం ధడక్. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకోక పోయినా జాన్వీ మొదటి సినిమా కావడం వల్ల అందరికీ గుర్తుండి పోయింది. అందుకే ఆ ఫ్రాంచైజీలో లవ్ స్టోరీతో సిద్ధాంత్ చతుర్వేది హీరోగా త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటించిన 'ధడర్ 2' వచ్చింది. సినిమాకు మొదటి నుంచి కూడా కాస్త నెగటివ్ ప్రచారం ఉంది. దాంతో ఓపెనింగ్ ఆశించిన స్థాయిలో అందుకోలేదు. కానీ సినిమా విడుదల తర్వాత మెల్ల మెల్లగా మౌత్ టాక్‌తో పాజిటివ్ కలెక్షన్స్ వైపు అడుగులు పడుతున్నాయి. రెండో వారంకు ఖచ్చితంగా సినిమా పుంజుకుంటుందనే నమ్మకంను మేకర్స్‌తో పాటు, బాక్సాఫీస్ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ధడక్ 2 సినిమాలో త్రిప్తి డిమ్రి నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. సింపుల్ అమ్మాయి లుక్‌లో త్రిప్తి మెప్పించింది. యానిమల్ తర్వాత ఆ స్థాయిలో పాజిటివ్ టాక్ ఈ సినిమాకు, అందులోని పాత్రకు దక్కడం విశేషం. గత ఏడాది మొత్తం విమర్శలు ఎదుర్కొన్న త్రిప్తి, మొన్నటి వరకు సోషల్ మీడియాలో టార్గెట్ అయిన త్రిప్తికి ధడక్ 2 సినిమా చాలా పెద్ద రిలీఫ్ ను ఇచ్చినట్లు అయిందని ఇండస్ట్రీ వర్గాల వారు, ముఖ్యంగా సోషల్ మీడియాలో ఆమెను అభిమానించే వారు కామెంట్స్ చేస్తున్నారు. త్రిప్తి డిమ్రి ఇదే జోష్‌తో మరిన్ని సినిమాల్లో నటించాలని, త్వరలో నటించబోతున్న ప్రభాస్ స్పిరిట్ సినిమా సైతం మంచి విజయాన్ని సొంతం చేసుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# స్కూటీ డిక్కీలో నుంచి నగదు అపహరణ



**ముథోల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

స్కూటీ డిక్కిలో నుంచి ఐదు లక్షల రూపాయలను అపహరణ చేసిన సంఘటన భైంసా పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన బొంబోతుల ఆనంద్‌కు అమెరికాలో ఉంటున్న తన కూతురు డబ్బులను పంపగా... సోమవారం పట్టణంలోని యూనియన్ బ్యాంక్ నుంచి రూ.5 లక్షలు విత్ డ్రా చేశానని తెలిపారు. అట్టి డబ్బుల్ని స్కూటీ డిక్కిలో పెట్టుకొని ఇంటికి బయలు దేరే క్రమంలో, పట్టణంలోని సాయి లక్ష్మీ బార్ వద్ద స్కూటీని నిలిపి భోజనం కోసం వెళ్ళాడు. ఇదే సమయంలో ఇద్దరు ఆగంతకులు ద్విచక్ర వాహనంపై బార్ వద్దకు వచ్చి, అందులో ఒకడు స్కూటీ డిక్కి తెరిచి అందులో నుంచి డబ్బులు ఆపహరించుకపో యాడు. భోజనం చేసి స్కూటీ వద్దకు చేరుకునేస రికి స్కూటీ లో డబ్బుంతా మాయమైపోయింది. డబ్బులు చోరికి గురైనట్లు గుర్తించిన బాధితుడు వెంటనే బార్ నిర్వాహకులకు సంబంధిత చోరి విషయాన్ని వివరించారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంబంధిత విషయాన్ని తెలుపగా, టౌన్ సీఐ గోపినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు చోరి ఘటన చేదించేందుకు గాను సీసీ పుటేజీ పరిశీలన చర్యలు చేపట్టారు.



# మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు

## ముగ్గురిపై కేసు నమోదు

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ సూచించారు. డ్రీమ్ డాలర్ లైఫ్ (టోకెన్ ప్యాకెట్ అప్లికేషన్ ద్వారా) పేరుతో మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలకు పాల్పడుతున్న మొండే నారాయణ (షాంపూర్, ఉట్నూర్), చౌకటి సంగ్రామ్ (షాంపూర్, ఉట్నూర్), రితీష్ వాలే కర్ (వని, మహారాష్ట్ర) అనే ముగ్గురిపై ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. వీరిలో మొండే నారాయణ, చౌకటి సంగ్రామ్లను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో కొందరు నిందితులు మోసాలకు పాల్పడుతున్నారని ఆమె పేర్కొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో సీట్ రాలేదని

# విద్యార్థిని ఆత్మహత్య

**ముథోల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**



బాసర ట్రిపుల్ ఐటీలో సీట్ రాలేదని విద్యార్థిని ఆత్మ హత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ధనుర్ గ్రామానికి చెందిన శైలజ (15) పదో తరగతిలో 563 మార్కులు సాధించింది. కాగా బాసర ట్రిపుల్ ఐటీలో సీటు కోసం దరఖాస్తు చేసుకుంది. కానీ కౌన్సిలింగ్‌లో ట్రిపుల్ ఐటీలో సీటు రాకపోవడం తో మనస్థాపానికి గురైంది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అటెండర్స్ కాలనీలో గల వారి బంధువుల ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. తల్లి మునిమల వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటవ టౌన్ ఎస్సై రమ్య తెలిపారు.

# గోడ కూలి వ్యక్తి మృతి

## కళాశాల ప్రాంగణంలో దుర్ఘటన

**మంచిర్యాల, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గోదావరి రోడ్డులోని ఓ ప్రైవేట్ కళాశాల ప్రాంగణంలో రేకుల షెడ్డుకు మరమ్మతులు చేస్తుండగా గోడ అకస్మాత్తుగా కూలిపోవడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బెజ్జూరు మండలం పోతపల్లి గ్రామానికి చెందిన డోక్యా.లచ్చన్నగా గుర్తించారు. ప్రమాద సమయంలో అక్కడ మరికొంత మంది కార్మికులు ఉన్నప్పటికీ వారు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## ఖానాపూర్ బస్టాండ్‌లో

# మహిళల పర్సులు మాయం



**ఖానాపూర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఇద్దరి మహిళల పర్సులు దొగలించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. మండలం కేంద్రంలోని సోమరిపేట్ గ్రామలోని మహిళలు తమ గ్రామానికి వెళ్లటానికి ఖానాపూర్ బస్టాండ్ లో ఉండగా.. బస్టాండ్ లో ఆ గ్రామానికి వెళ్ళడానికి వచ్చిన బస్సులోనికి గబదిబగా ఒక్కసారి బస్సులోకి ఎక్కడంతో ఆ గ్రామానికి చెందిన కొడారి మంజుల, ఎడ్ల వనిత ల పర్సులు దొంగలించారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు బస్టాండ్ లోని సోమరిపేట్ గ్రామానికి వెళ్లే బస్సులోని ప్రయాణికులను తనిఖీ చేశారు. కానీ దొంగలు అప్పటికే వెళ్లిపోయారు.రద్దీలో ఉన్నప్పుడు తమ వస్తువులు జాగ్రత్త వహించాలని పోలీసులు సూచించారు.

## మృత శిశువును

# తీసుకెళ్లని కుటుంబం

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

రిమ్స్ ఆసుపత్రిలో అయిదు రోజుల క్రితం వదిలేసిన మృత శిశువును తీసుకెళ్లటానికి కుటుంబ సభ్యులెవరూ ఇప్పటి వంకు రాలేదు. దీంతో ఆ మృత శిశువును రిమ్స్ మార్చురీలోనే ఉంచేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో గత నెల 27న జైనథ్ మండలానికి చెందిన గర్భిణికి కాన్పు అయింది. జన్మించిన ఆడ శిశువు ఒక కిలో లోపు బరువు మాత్రమే ఉండటంతో ఆ ఆసుపత్రి వారు రిమ్స్ ఎస్ఎన్సీయూకి అదే రోజు రిఫర్ చేశారు. శిశువును బేబీ ఆఫ్ రాధ అనే పేరుతో చేర్చుకొని వెంటిలేటర్పై ఉంచి చికిత్స అందించినా 29న సాయంత్రం మృతి చెందింది. ఆసుపత్రి వారు శిశువు కుటుంబీకులకు చెందిన ఫోన్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావటంతో మృత శిశువును మార్చురీలోనే భద్రపర్చి ఉంచారు. తక్కువ బరువుతో పుట్టిన శిశువును కాపాడేకుందుకు రిమ్స్ వైద్యులు శతవిధాయాల ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.



# పోరాటం తప్ప మరో మార్గం లేదు



## పెన్షన్‌దారుల సమస్యలపై 13న మహాగర్జన ఆదిలాబాద్ సన్నాక సమావేశంలో పద్మశ్రీ మందకృష్ణ

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే చేయూత, ఆసరా పెన్షన్ల ను పెంచుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటన చేశారాని, అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచిన హామీని నెరవేర్చ డం లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆరోపిం చారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన వికలాంగులు, చేయూత పెన్ష న్ దారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ... వికలాంగుల పెన్షన్లు రూ. 6000కు పెంచాలని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఇతర చేయుత పెన్షన్ దారుల పెన్షన్ లన్ని రూ. 4,000 పెంచాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న హైదరాబాద్‌లో జరగబోయే మహాగర్జన విజయవంతనికై నేడు ఆదిలాబాద్ జిల్లాలో పెన్షన్ దారుల సన్నాహక మహాసభను నిర్వహించమన్నారు. పెన్షన్ల పెంపు గురించి అధికార పార్టీకి చిత్తశుద్ధి లేదని, ప్రతిపక్షాలకు పట్టింపు లేదని విమర్శించారు. పోరాటం తప్ప మరో మార్గం లేదని తెలియజేశారు. ఆగస్టు 13న పెన్షన్ల పెంపు కోసం జరుగుతున్న మహా గర్జనకు పెద్ద ఎత్తున హైదరాబాద్ కు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ, విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు కన్నేపల్లి ప్రేమ్‌రాజ్, సీనియర్ నాయకుడు మహబూబ్, కనక కిషన్, షేక్ మైబూబ్ నివర్తి, నాందేవ్, సంతోష్, సురేఖ, దుర్వ, హరూమాన్ బి, షేక్ మైనుద్దీన్, అనసూయ, ఎమ్మార్పీఎస్, ఆసర చేయూత పెన్షన్ దారుల కమిటీలు పాల్గొన్నారు.



## బెల్లంపల్లిలో గుండెపోటుతో

# ప్రముఖ వస్త్ర వ్యాపారి మృతి

**బెల్లంపల్లి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణానికి చెందిన రెడీమేడ్ వస్త్ర వ్యాపారి గుల్షన్ కుమార్ సహాని గుండెపోటుతో సోమవారం సాయంత్రం మృతి చెందారు. 85 ఏళ్ల గుల్షన్ కుమార్ సహాని బెల్లంపల్లి పట్టణంలో గుల్షన్ రెడీమేడ్ డ్రెస్సెస్ దుకాణాన్ని ఏర్పాటు చేసి ప్రముఖ వస్త్ర వ్యాపారిగా పేరు తెచ్చుకున్నారు. మృతి చెందిన గుల్షన్ కుమార్ సహాని ప్రతీ ఒక్కరికి సుపరిచితుడు. ఆయన మృతి పట్ల వస్త్ర వ్యాపారులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## నిర్లక్ష్యంగా నడిపిన ట్రాక్టర్

# డ్రైవర్‌కు ఎనిమిదేళ్ల శిక్ష

**ఆదిలాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

ఎదులాపురం గ్రామానికి చెందిన వ్యక్తి మృతికి కారణమైన ఆదిలాబాద్ పట్టణంలోని రణదివెనగరికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సురేతర్ సంతోష్‌కు ఎనిమిది ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.11 వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ సీనియర్ సివిల్ జడ్జీ సీఎం రాజ్యలక్ష్మి సోమవారం తీర్పును వెలువరించారు. ట్రాక్టర్ యజమాని బ్రహ్మకంటి శివమణికి సైతం రూ.1000 జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే.. లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపిన వివరాల మేరకు.. ఆదిలాబాద్ పట్టణం రాంనగర్కు చెందిన నవీద్ అహ్మద్ 2021 జులై 26న కాలినడకన వెళుతుండగా నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడుపుతూ వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తలకు గాయాలైన బాధితుడిని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఆదిలాబాద్ వన్ టౌన్‌లో కేసు నమోదైంది. ఎనిమిది మంది సాక్షులను పీపీ షాహీన్ సుల్తానా విచారించి నేరాన్ని రుజువు చేశారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి తీర్పును వెలువరించారు.

# మహిళకు ఏడాది జైలు శిక్ష

**భీమిని, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

విగాం గ్రామానికి చెందిన గాండ్ల అంకమ్మ అనే మహిళకు బెల్లంపల్లి కోర్టు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధించింది. 2017న అదే గ్రామానికి చెందిన గాండ్ల పార్వతి అనే మహిళను వివస్త్ర చేసి బూతులు తిట్టిన కేసులో ఈ శిక్ష పడింది. ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కె. శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. మొత్తం 6 మంది సాక్షులను విచారించిన కోర్టు, నేరం రుజువు కావడంతో మేజిస్ట్రేట్ జె. ముకేశ్ ఈ తీర్పు వెలువరించారు.

# యథేచ్ఛగా మొరం దందా

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)
బెల్లంపల్లి పట్టణ శివారు, మండల పరిధిలోని ప్రభుత్వ భూముల నుంచి అనుమతి లేకుండా మొరాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేపట్టడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ అక్రమ దందా సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బెల్లంపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న మెయిన్ రోడ్డు పక్కన బూధాకలాన్ రాతి చెరువు సమీపంలో ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా తవ్వి తీసిన మొరాన్ని ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఆకెనపల్లి, పాతబెల్లంపల్లి శివారులోని పట్టణంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద అక్రమంగా తవ్వకాలు జరిపి మొరాన్ని తరలిస్తున్నారు. బూధాఖుర్ధు, బట్వాన్‌పల్లి, పెరకపల్లి గ్రామాల శివారుల్లో సైతం అనుమతి లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. బెల్లంపల్లి మండలంలో పలు గ్రామపంచాయతీల పరిధిలో కూడా మొరం దందా సాగుతున్నట్లు తెలుస్తున్నది. ఈ తతంగమంతా పగలు, రాత్రి అని తేడా లేకుండా జరుగుతున్నదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు అందుబాటులో లేని శని, ఆదివారాలతో పాటు, ప్రభుత్వ సెలవు దినాల్లో మరింత జోరుగా సాగుతున్నదని విమర్శలు వస్తున్నాయి. ట్రాక్టర్ మొరాన్ని మట్టిని రూ.800 నుంచి 1000 విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికుల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందినప్పుడు నామమాత్రపు తనిఖీ చేస్తున్నారని, పట్టుబడ్డ ట్రాక్టర్లను రాజకీయ ఒత్తిడి కారణంగా వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ అడ్డూ అదుపు లేకుండా దందా సాగిస్తున్నారు. ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నదని, భూగర్భజలాలు అడుగంటుతున్నాయని, తవ్విన ప్రదేశాల్లో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారుతున్నాయని, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని తనిఖీలు ముమ్మరం చేసి అక్రమంగా మొరం తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇండ్ల నిర్మాణం పేరుతో..**
భీమిని మండలంలోని రాంపూర్‌లో ఇంటి నిర్మాణాల పేరుతో కొన్ని రోజులుగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఆదివారం రోడ్డు పక్కన ఉన్న చెరువు కాలువ నుంచి మట్టిని తరలించారు. చెరువులపై పీడబ్ల్యూడీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో పట్ట పగలే యథేచ్ఛగా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ బికర్ణ దాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా రాంపూర్‌లో మట్టి తరలించేందుకు అనుమతి ఇవ్వలేదని, అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



**అక్రమంగా తరలించే వారిపై చర్యలు తప్పవు...**
ఈ విషయమై బెల్లంపల్లి తహసీల్దార్ కృష్ణను వివరణ కోరగా ప్రభుత్వ భూముల నుంచి మొరం అక్రమంగా తరలించ కుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

### ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్

**ముథోల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
ప్రతిరోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. సోమవారం పట్టణంలోని గౌతమి హైస్కూల్ లో నిర్మల్ జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో జిల్లా స్థాయి యోగా పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగా డే రోజున విశాఖపట్నంలో ఒకే చోట 6 లక్షల మంది యోగా చేయడం, అందులో ప్రధాని పాల్గొనడం గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన విషయం గుర్తు చేశారు. యోగాను స్పోర్ట్స్‌గా గుర్తించి, ఒలంపిక్‌లో పాల్గొనేలా చేయడం జరిగిందన్నారు. యోగాసనాలతో మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలు గుతారన్నారు. ప్రతి ఒక్కరు యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. పాఠశాలలో చిన్నారులకు యోగ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. భైంసాలో జిల్లాస్థాయి పోటీ నిర్వహించడం శుభ పరిణామం అని, యోగ పోటీల నిర్వహణకు ఎల్లవేళలా తన సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శి మల్లేష్‌లను సన్మానించిన అభినందించారు. కార్యక్రమంలో నిజామాబాద్‌జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ ప్రదీప్, డాక్టర్ రామకృష్ణ గౌడ్, నాయకులు దత్తాత్రి, వెంగల్‌రావ్, సుష్మరెడ్డి, దత్తురామ్ పటేల్, యోగేష్, కరస్పాండెంట్ రవి పాల్గొన్నారు.

### బీసీలకు 42% రిజర్వేషన్ సాధనకు

## మీనాక్షి నటరాజన్‌తో ప్రయాణం

**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదం కోసం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో సోమవారం రైలు ప్రయాణంలో వాంకిడి మండల ఓబీసీ ప్రెసిడెంట్ జబోరే గణేష్. వారితో మండలంలోని సమస్యలు వివరించడానికి అనుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



## ఆర్జీయూకేటీలో యక్షగాన కళా ప్రదర్శన



**ముథోల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
బాసరలోని ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో సోమవారం స్పిక్ మాకే హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో యక్షగాన కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సంద ర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు యువతలో సాంస్కృతిక అవగాహన పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయ న్నారు. 'స్పిక్ మాకే' సంస్థ తెలంగాణ 4వ రాష్ట్ర కన్వెన్షన్ను ఈ ఏడాది బాసర క్యాంపస్‌లో నిర్వహించడం గర్వకారణమన్నారు. కర్ణాటక నుంచి వచ్చిన కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాకారుడు శ్రీ కేరమనే శివానంద హెగ్డే మాట్లా డుతూ ఇంత గొప్ప వేదికపై ప్రదర్శించటం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా రామాయణంలోని 'సీతాపహరణం' ఘట్టాన్ని ఆధారంగా తీసుకుని, రావణుని అధర్మపు చర్యలు, సీతమ్మ త్యాగం, రామ లక్ష్మణుల బాధలను అత్యం త హృద్యంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య మురళీదర్శన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'కదిలి'కి వచ్చిన భక్తులు



**దిలావర్‌పూర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం శ్రీశ్రీశ్రీ కదిలి పాప అన్నపూర్ణ ఆలయానికి శ్రావణ సోమవారాన్ని ప్రశ్నించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 7 గం టల నుంచి ఆలయానికి రావడంతో శివలింగ దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. మధ్యాహ్నం మహా మంగళ హారతి కార్యక్రమం నిర్వహించారు భజన సంకీర్తన లు చేపట్టారు. కుంటాల మండలం కల్లూరు చెందిన శ్రీధర్ భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని అందించారు. భక్తులను దృష్టిలో పెట్టుకొని ఆలయంలో భారీ సంఖ్యలో పోలీసు లు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయా న్ని డీసీసీ అధ్యక్షుడు సిఆర్ రావు తోపాటు ఉద్యోగులు భక్తులు పూజలు నిర్వహించారు.

## సత్వర న్యాయం జరిగేలా చూడాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులనుంచి అర్జీలు స్వీకరించి వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ప్రజాఫిర్యాదులను నేరుగా స్వీకరిస్తూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.



## నేడు మంచిర్యాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

**మంచిర్యాల, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో బలోపేతమే లక్ష్యంగా కాషాయ పార్టీ అడుగులు వేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రాఘునాథ్ రావుతోపాటు సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పర్యటన విజయవంతానికి అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర కమల దళపతి హోదాలో తొలిసారి ఆయన జిల్లాకు వస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో దండేపల్లి మండలం గూడెం బ్రిడ్జి మీదుగా లక్సెట్టిపేటకు చేరుకుంటారు. అక్కడి నుంచి పట్టణానికి బైక్ ర్యాలీ నిర్వహిస్తారు. అక్కడ ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో రైతు సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులను కలుస్తారు. తర్వాత ఆసిఫాబాద్ జిల్లా వెళ్లే క్రమంలో మార్గమధ్యలో మందమర్రిలో స్థానిక నాయకులతో భేటీ అవుతారు.



చెన్నూరు నియోజకవర్గ ఇన్చార్జి, దుర్గం అశోక్ నేతృత్వంలో ఇక్కడ ఏర్పాట్లు చేశారు. తిరిగి ఆసిఫాబాద్ జిల్లా పర్యటన ముగించుకుని జిల్లా గుండా వెళ్లే సమయంలో బెల్లంపల్లిలో నాయకులను కలిసే అవకాశముందని వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు.



## మెరుగైన వైద్య సేవలందించాలి

### గుడిహత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రాజర్షి షా

**గుడిహత్నూర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
గుడిహత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని వివిధ వార్డులు, ఔషధ నిల్వ గదులు, వ్యాక్సినేషన్, ప్రసూతి విభాగం, రిజిస్టర్ నమోదు తదితర అంశాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వార్డులో పేషంట్‌తో వచ్చిన వారితో మాట్లాడుతూ డెలవరి ఎప్పుడైంది, శిశువు ఆరోగ్యంగా ఉన్నారా, బరువు ఎంత, ఏ ఊరి నుండి వచ్చారు.. ఇక్కడ వైద్య బాగా చేస్తున్నారని అని వాకాబు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బందిపై ఉందన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ఇండెంట్ పెట్టాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెం డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌వో మనోహర్, డాక్టర్ శ్యామ్ సుందర్, స్టాఫ్ నర్స్ తిరుమల రాణి, అటెండర్లు, తదితరులు ఉన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సాయం

**బెల్లంపల్లి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని 21 వ వార్డు బూడిదగడ్డ బస్తీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎన్నారై తోడే వెంకట కృష్ణారెడ్డి రూ 30 వేల ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావుకు కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో అందజేశారు. వార్డు మాజీ కౌన్సిలర్ వంశీకృష్ణారెడ్డి జ్ఞాపకార్థంగా నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు అందజేసినట్లు పేర్కొన్నారు.

## భార్యను చంపిన భర్త అరెస్ట్

**జైపూర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**
జైపూర్ మండలంలో భార్యని చంపిన భర్తను అరెస్ట్ చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. నర్వ గ్రామానికి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి రాజయ్య ఈనెల 2న రాత్రి భార్య రాజమణితో గొడవపడి చంపాలనే ఉద్దేశంతో కట్టె తీసుకుని ఆమె తల వెనకాల కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కూతురు ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని సీఐ వివరించారు.

# రాష్ట్రపతి విందుకు కైలాష్‌కు ఆహ్వానం



**ప్రభుత్వ ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం**
**పంద్రాగస్టున ప్రత్యేక కార్యక్రమం..**
**గోండి భాషలో 'పండోక్న మహాభారత్ కథ' రాసిన ఇంద్రవెల్లి మండలం గౌరపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కైలాష్**

**ఇంద్రవెల్లి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

ఇంద్రవెల్లి మండలం గౌరపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు తొడసం కైలాష్‌కు అరుదైన గౌరవం దక్కింది. కేవలం 4 నెలల్లోనే గోండి భాషలో మహాభారతం పుస్తకాన్ని రచించిన ఆయనకు పంద్రాగస్టు సందర్భంగా రాష్ట్రపతితో విందులో పాల్గొనేందుకు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం అందింది. ఈ లేఖను సోమవారం సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సందీప్, పోస్టల్ పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్పెక్టర్ మహేష్, పోస్ట్‌మెన్‌లు ప్రణయ్, సాయి, ఎంఏ మునీర్.. కైలాష్ స్వగ్రామం వాఘపూర్‌కు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా కైలాష్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం అందడం ఆనందంగా ఉన్నదన్నారు. తన మాతృ భాష అయిన గోండి భాషలో "పండోక్న మహాభారత్ కథ" పేరుతో మహాభారతాన్ని గోండి భాషలో అనువదించి పుస్తకాన్ని ఆవిష్కరించినట్టు తెలిపారు. మహాభారతాన్ని గోండి భాషలో తన మొబైల్ ఫోన్ లోనే టైప్ చేశానాని తెలిపారు. అంతరించే ప్రమాదంలో ఉన్న గోండి పదాలతో ఈ పుస్తకం రాశానన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి మన్నన పొందానని తెలిపారు. గోండి భాషలో మొట్టమొదటి సారిగా ఒక కృత్రిమ మేధ యాంకర్ 'సుంగల్ తుర్పో', 'నెలేంజ్'ను సృష్టించి వార్తలు తయారు చేసి యూట్యూబ్‌లో ప్రచారం చేసినట్టు వెల్లడించారు. ఇంకా అనేక కథలను తయారు చేసి కృత్రిమ మేధ ద్వారా చదివించి తన యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేసినట్టు తెలిపారు. కనుమరుగవుతున్న గొండి పదాలను ఉపయోగించి వాడుకలోకి తెచ్చి ప్రజలకు అందించానని చెప్పారు. గోండి, కొలామి, తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో ఇప్పటి వరకు 330కి పైగా పాటలు రాసి వాటిని ఏఐతో పాడించానని తెలిపారు. తాను స్వరపరిచిన పాటలను యూట్యూబ్, ఇన్‌స్టా, ఫేస్బుక్‌లలో పోస్ట్ చేశానన్నారు. ఆ పాటలు విన్న ఆదివాసీ యువతి, యువకుల నుంచి స్పందన లభించిందన్నారు. వాఘాపూర్ గ్రామస్తులు కైలాష్ దంపతులను సత్కరించారు.

# ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి**
**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**
**జనకాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ**
**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, గ్రామాలలో సందర్శించి జ్వర పీడితులను గుర్తించి వారికి అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని తెలిపారు. ప్రతి మంగళవారం, శుక్రవారం గ్రామాలలో ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి డ్రైడే – ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. మండలంలోని బూర్గుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ, తరగతి గదులు పరిశీలించారు. విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారం, సిద్ధమైన త్రాగు నీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పఠన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



## భారీ వాహనాలకు త్వరలో అనుమతి

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**ఉట్నూర్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలకు త్వరలోనే అనుమతులు వస్తా యని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ రాష్ట్ర అటవీ శాఖ వైల్డ్ లైఫ్ బోర్డ్ సమావేశంలో పలు విషయాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రం విలేకరులతో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకకు సహకరించాలని, అటవీ హక్కు చట్టం ప్రకారం అడవిలో ఉండే ఆదివాసీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీలు, ఇతర రైతులను ఇబ్బంది పెట్టవద్దని, పోడు భూముల్లో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు సహకరించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని, బఫర్ జోన్‌ను రద్దు చేయాలని అటవీశాఖ అధికారులకు మంత్రులు సీతక్క, సురేఖతో ఎమ్మెల్యే బొజ్జు సూచించినట్లు తెలిపారు. తాత్కాలికంగా రోడ్లు, వంతెనలకు సహకరించాలని, ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఒంటెద్దు పోకడలకు పోతే ఓపిక నశించి ప్రజలు తిరుగుబాటు చేస్తారని, ఈ విషయంపై ఆలోచించాలని, పై విషయాలపై వైల్డ్ లైఫ్ బోర్డ్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. త్వరలోనే భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేస్తా రని ఆశభావం వ్యక్తం చేశారు.

## అందరికి ఆదర్శం ఈ దంపతులు



**నిర్మల్, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

జిల్లా వైద్య శాఖలో విధులు నిర్వహిస్తున్న వైద్య ఉద్యోగి జొన్న వినోద్ కుమార్ దంపతులు తమ మరణానంతరం తమ బాడీలను అవయవాలను మెడికల్ కాలేజీకి అప్పగించేందుకు ముందుకు వచ్చారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అవయవాలను చేసేం దుకు ముందుకు వచ్చిన వినోద్ కుమార్ దంపతులను అంగీకర పత్రాన్ని స్వీకరించిన అధికారులు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో దంపతులను ఘనంగా సన్మా నించారు. అవయవదానాలు చేసేందుకు ముందుకు వచ్చిన దంపతులకు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పెన్షన్ సంఘం జిల్లా అధ్యక్షులు లింగన్న, ఉద్యోగులు ఉన్నారు.

## ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు

**కోటపల్లి, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

కోటపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థుల పట్ల అసబ్యకరంగా పవర్తించిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్ పై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు కోటపల్లి ఎస్సై రాజేందర్ తెలిపారు. విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు అని కోటపల్లి ఎస్సై రాజేందర్ హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయిలో ఉత్తమ పోలీస్ డాగ్‌గా సింబా

**మంచిర్యాల, ఆగస్టు 4 (ప్రభాత సమాచారం)**

వరంగల్ జిల్లాలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండో పోలీస్ డ్యూటీ మీట్‌లో కాలేశ్వరం జోన్ నుంచి రామగుండం పోలీస్ కమిషనరేట్ నార్కోటి డాగ్ సింబా ఉత్తమ పోలీస్ డాగ్‌గా ఎంపికైంది. నార్కోటిక్ విభాగం పోటీలో పాల్గొని గంజాయి, మత్తుపదార్థాలను గుర్తించడంలో పోలీస్ జాగిలం సింబా, డాగ్ హ్యాండ్లర్ ఏ ఆర్ కానిస్టేబుల్ వేణుగోపాలకృష్ణ బంగారు పతకం సాధించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా సోమవారం అభినందించారు.

